సాక్షి
నల్లగొండ
మంగళవారం ; 26 ; డిసెంబర్ ; 2023



షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం
షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన అడవిదేవులపల్లి మండలం హేంతండాలో చోటుచేసుకుంది. - 8లో



యాదాద్రిలో అధ్యయనోత్సవాలు
యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. - 10లో



గంజాయి విక్రేత అరెస్టు
యాదగిరిగుట్ట పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. - 10లో

న్యూస్‌రీల్

వీఐపీ గెస్ట్ హౌస్‌గా తీర్చిదిద్దాలి : మంత్రి



మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో కొత్తగా నిర్మిస్తున్న ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని వీఐపీ గెస్ట్ హౌస్‌గా తీర్చిదిద్దాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇంజనీర్లను ఆదేశించారు. సోమవారం ఆయన అతిథి గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.6.25 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న అతిథి గృహం ఎంట్రెన్స్ గేట్ పెద్దగా ఉండేలా చూడాలని సూచించారు. నిర్మాణ పనులను నాణ్యతాప్రమాణాలను అనుసరించి ఎనిమిది నెలల్లోగా పూర్తి చేయాలని సూచించారు.

మను ధర్మశాస్త్రం.. అశాస్త్రీయమైంది



మనుధర్మ శాస్త్ర ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: మను ధర్మశాస్త్రం అశాస్త్రీయమైనదని, దేశంలో అసమానతలకు, కుల వివక్షకు మనుధర్మ శాస్త్రమే కారణమని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున విమర్శించారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మనుధర్మశాస్త్ర ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కుల వ్యవస్థను నెలకొల్పి మనుషుల మధ్య చిచ్చుపెట్టిన మనుధర్మాన్ని తొంభై ఐదేళ్ల క్రితం ఇదే రోజు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ తగులబెట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘా నాయకులు పి.సైదులు, బకరం శ్రీనివాస్, పుచ్చకాయల నర్సిరెడ్డి, ఇందూరు సాగర్ మానుపాటి భిక్షమయ్య, అశోక్‌రెడ్డి, గోలి సైదులు, కట్టెల శివకుమార్, గాదె నర్సింహ, దండెంపల్లి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఎల్ పరిశ్రమ విస్తరణ పనులు నిలిపివేయాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చిట్యాల: వెలిమినేడు గ్రామ పరిధిలో ఉన్న ఎంపీఎల్ స్టీల్ పరిశ్రమ విస్తరణ పనులను నిలిపివేయాలని రాష్ట్ర దళిత్ శక్తి ఫోరం అధ్యక్షుడు మేడి నరేష్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి సురేష్‌బాబుతోపాటు పలు శాఖల అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండు సుధాకర్, పబ్బు రాజుగౌడ్, జినుకుంట్ల కార్తీక్, కిశోర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లడిల్లిన తండాలు



రోదిస్తున్న మృతుల బంధువులు

ఎటు చూసినా కన్నీటి ధారలే

- నిడమనూరు మండలంలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురి మృతి
- మృతుల్లో ఐదుగురిది పెద్దవూర మండలం పూల్యతండా, మల్లెవానికుంట తండా
- మరొకరు నిడమనూరు మండలం వాసి
- మృతులంతా నిరుపేద కుటుంబాలకు చెందిన వారే

తిరుమలగిరి(నాగార్జునసాగర్)/ పెద్దవూర : ఆ తండాల్లో ఎవరిని కదిలించినా కన్నీరే ఉబికి వస్తోంది.. పొట్టచేతపట్టుకొని పట్నం పోయినా ఆ కుటుంబాల తలరాత మాత్రం మారలేదు. రెక్కాడితే కానీ డొక్కాడని ఆ కుటుంబాలకు రోడ్డు ప్రమాదాలు తీరని శోకాన్ని మిగిల్చాయి. నిడమనూరు మండలంలో సోమవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పెద్దవూర మండలం పూల్యతండా, మల్లెవానికుంట తండాల్లో ఉంటున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురితో పాటు వేంపాడు గ్రామానికి చెందిన మరొకరు ప్రాణాలు కోల్పోయారు.

దత్తాత్రేయ స్వామి దర్శనానికి వెళ్లాలని స్వగ్రామానికి వస్తూ..

పెద్దవూర మండలం నిమ్మనాయక్‌తండా ఆవాస గ్రామమైన మల్లెవానికుంట తండాకు చెందిన రమావత్ ప్రభాకర్, నాగమణి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు శివనాయక్(19) ఉన్నారు. పెద్ద కూతురు మౌనికకు వివాహం కాగా, చిన్న కూతురు ఇంటి వద్దే ఉంటోంది. కుమారుడు శివకేశవ్ నాగార్జునసాగర్‌లో ఇంటర్ పూర్తి చేశాడు. గత సంవత్సరం నుంచి గుంటూరులో ఫ్లవర్ డెకరేషన్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగు సంవత్సరాల క్రితమే ప్రభాకర్ తన భార్యను ఇంటి వద్దే ఉంచి అతను హైదరాబాద్‌కు వెళ్లి కూలి పనులు చేస్తున్నాడు. సోమవారం పౌర్ణమి కావడంతో తండా మొత్తం గుంటూరు జిల్లా మాచర్ల మండలంలో ఉన్న ఎత్తిపోతల(దత్తాత్రేయ స్వామి ఆలయం) వెళ్లాల్సి ఉంది. శివకేశ్ కూడా ఎత్తిపోతల దత్తాత్రేయ స్వామి ఆలయానికి వెళ్లడానికి ఆదివారం తండాకు వస్తున్నాడు. నిడమనూరు మండలం వేంపాడ్ స్టేజి వద్దకు రాగానే అదే గ్రామానికి చెందిన బల్గూరి సైదులును బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ఘటనలో సైదులు అక్కడికక్కడే మృతిచెందగా శివనాయక్ మిర్యాలగూడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

ప్రమాదస్థలికి వస్తూ.. మృత్యుఒడికి

రమావత్ ప్రభాకర్, అతని సోదరుడు రమావత్ గనియా, అల్లుడు నాగరాజు, కుమార్తె మౌనిక, పూల్యతండాకు చెందిన ప్రభాకర్ సోదరి మూడావత్ బుజ్జి, బావ మూడావత్ పాలేఖ, రమావత్ పాండు హైదరాబాద్‌లోని బీఎన్‌రెడ్డి నగర్‌లో నివసిస్తున్నారు. ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో శివకేశవ్ మృతిచెందిన విషయం కుటుంబ సభ్యులకు తెలిసింది. పూల్యతండాకు చెందిన రమావత్ పాండు నాయక్ ప్రభాకర్‌కు దూరపు బంధువు. పాండు నాయక్ హైదరాబాద్‌లో టాటాఏస్ వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శివనాయక్‌ను చూడటానికి టాటాఏస్‌లో రమావత్ పాండు నాయక్(40), మూడావత్ బుజ్జి(37), రమావత్ గనియా(42), డుమావత్ నాగరాజు(28)తో పాటు ప్రభాకర్, పాలేఖ, వినోద్‌తో పాటు మౌనిక బయలుదేరారు. మౌనిక గర్భిణి కావడంతో ఆమెను మల్లెవాని కుంటతండాలో ఉంచి మిగతా ఏడుగురు ప్రమాదం జరిగిన నిడమనూరు మండలం వేంపాడ్ స్టేజి వద్దకు బయలుదేరారు. ప్రమాదస్థలికి కిలోమీటర్ దూరంలోనే నిడమనూరు మండల పరిధిలోని 3వ నంబర్ కెనాల్ సమీపంలో వీరి వాహనాన్ని.. ఏపీలోని జగ్గయ్యపేట నుంచి కర్నాటకకు వెళ్తున్న డీజిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో నలుగురు మృతిచెందగా ప్రభాకర్, పాలేఖ, వినోద్ గాయపడ్డారు. ప్రమాదానికి పొగమంచే కారణమని తెలుస్తోంది.



ఘన్య, శివనాయక్ మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



ప్రమాద ఊహా చిత్రం



ప్రమాదం జరిగిన ప్రాంతం ఇదే



రోదిస్తున్న రమావత్ పాండు కుమారుడు

తోడుగా వచ్చి..

పూల్యతండాకు చెందిన రమావత్ పాండు నాయక్‌ది నిరుపేద కుటుంబం. అతనికి సరోజ, పద్మ ఇద్దరు భార్యలు కాగా వారికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నాడు. కుటుంబంతో కలిసి నాలుగేళ్ల క్రితమే హైదరాబాద్‌కు వలస వెళ్లారు. పాండు నాయక్ ఇద్దరు భార్యల్లో ఒక భార్య ఆయాగా పనిచేస్తుండగా, మరో భార్య వాచ్‌ఉమెన్‌గా పనిచేస్తోంది. పాండు టాటాఏస్ వాహన డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తోడుగా వచ్చిన పాండు నాయక్ కూడా రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటుంబం ఇంటి పెద్ద దిక్కును కోల్పోయింది.

తండ్రి మృతి, చావుబతుకుల్లో కుమారుడు..

రమావత్ గనియాకు ఇద్దరు కుమారులు, కుమార్తె. ఐదు సంవత్సరాల క్రితం కుటుంబంతో కలిసి బతుకుదెరువుకోసం వలస వెళ్లాడు. గనియా పండ్ల బండి నడుపుతుండగా, భార్య కూలి పనులకు వెళ్తుంది. గనియా, ప్రభాకర్ ఇద్దరు అన్నదమ్ముళ్లు. గనియా తమ్ముడు ప్రభాకర్ కుమారుడు శివకేశవ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా అతడిని చూడటానికి గనియాతో పాటు అతని కుమారుడు వినోద్ కూడా వచ్చాడు. ఈ ప్రమాదంలో గనియా అక్కడికక్కడే మృతిచెందగా, కుమారుడు వినోద్‌కు రెండు కాళ్లు విరిగిపోయాయి. ఒక పక్క తండ్రి విగతజీవిగా మారగా కుమారుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు

పూల్యతండాకు చెందిన మూడావత్ పాలేక, బుజ్జి దంపతులకు ఇద్దరు అమ్మాయిలు కాగా వివాహాలు చేశారు. వీరు బతుకుదెరువు కోసం మూడు సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. బుజ్జి హోటల్‌లో పనిచేస్తుండగా, పాలేక పండ్లబండి నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శివనాయక్ బుజ్జి మేనల్లుడు కావడంతో అతడిని చూడటానికి వస్తూ జరిగిన ప్రమాదంలో బుజ్జి మృతిచెందగా, పాలేకకు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఇంటి పెద్దదిక్కును కోల్పోయి..

నిడమనూరు మండలం వేంపాడ్ గ్రామానికి చెందిన బల్గూరి సైదులుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సైదులు వేంపాడ్ స్టేజి వద్ద కిరాణం షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజు వారీలాగానే ఆదివారం రాత్రి కూడా షాపు మూసివేసి ఇంటికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా శివనాయక్ అతివేగంతో వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇంటి పెద్దదిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబం వీధిన పడింది.

హ్యాపీ క్రిస్మస్



క్రిస్మస్ పర్వదినం సందర్భంగా సోమవారం నల్లగొండ గడియారం సెంటర్‌లోని సెంటినరీ సెల్ఫ్ సపోర్టింగ్ తెలుగు బాప్టిస్టు చర్చిలో కేక్ కట్ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్‌కేశవ్‌పాటిల్, ఎస్పీ అపూర్వరావు, క్రైస్తవ సంఘం ప్రతినిధులు

యూజీడీ పనులు పూర్తయ్యేనా!

- నీలగిరిలో జటిలమవుతున్న డ్రెయినేజీ సమస్య
- విలీన గ్రామాల్లో మరింత అధ్వానం
- ఎనిమిది వార్డుల్లో అసలే లేని అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం
- కొన్ని కాలనీల్లో అసంపూర్తిగా పనులు
- కొత్త ప్రభుత్వంలో యూజీడీపై ఆశలు



నల్లగొండలోని ఓ కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

నీలగిరిలో మొత్తం వార్డులు **48**
యూజీడీ పనులు జరిగింది **210** (కి.మీ.)
నిర్మించాల్సిన డ్రెయినేజీ విస్తీర్ణం **400** (కి.మీ.)
అవసరమయ్యే నిధులు రూ.**600** కోట్లు

నల్లగొండ టూటౌన్: ఉమ్మడి జిల్లాలోనే అతి పెద్ద పట్టణంగా ఉన్న నీలగిరిలో ప్రజలకు మౌలిక వసతులు సమకూరడంలేదు. పట్టణం దినదినాభివృద్ధి చెందుతూ కాలనీల సంఖ్య పెరుగుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించకపోవడంతో మున్సిపాలిటీలోని వివిధ వార్డుల జనం నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా నీలగిరిలో గతంలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో పట్టణంలో మురుగునీటి సమస్య రోజురోజుకూ జటిలంగా మారుతోంది. కొన్ని కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు నానా తంటాలు పడాల్సి వస్తోంది. అధికారుల హామీలు నీటిమీద రాతలుగా మారాయి. పట్టణంలోని పలు కాలనీల్లో అసలు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) వ్యవస్థ లేనే లేదు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోయి ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో యూజీడీ పనులకు ప్రత్యేక నిధులు వచ్చేనా అనే చర్చ సాగుతోంది.

ఇళ్ల మధ్యే మురుగు నీరు..

పట్టణంలోని పలు కాలనీల్లో మురుగునీరు పోవడానికి డ్రెయినేజీలు లేకపోవడంతో ఇళ్ల మధ్యనే మురుగు నిలుస్తోంది. ఖాళీ స్థలాల్లో మురుగు నీరు చేరడం ద్వారా పందులకు నిలయంగా మారుతున్నాయి. మురుగు నీరు నెలల తరబడి నిలిచి ఉంటుండడంతో దుర్వాస వస్తోందని, ఆ వాసనను భరించలేక పోతున్నామని వివిధ కాలనీల ప్రజలు వాపోతున్నారు. మురుగు నీటి నిల్వల కారణంగా దోమల ఉధృతి పెరిగి జనం సీజన్ వ్యాధుల బారిన పడుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇదిలా ఉంటే పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేనికారణంగా ఒకరి ఇంట్లోని మురుగునీరు వీధుల్లోకి వస్తుండడంతో పక్కింటి వారితో ఘర్షణలు కూడా కూడా చోటు చేసుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి.

ఎనిమిది వార్డుల్లో లేని యూజీడీ

నీలగిరి మున్సిపాలిటీ పరిధిలో 48 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డుల పరిధిలో ఇప్పటి వరకు 210 కిలోమీటర్ల మేర అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఉంది. గంధంవారిగూడెం, మామిళ్లగూడెం, మర్రిగూడెం, చర్లపల్లి, ఆర్జాలబావి, కేశరాజుపల్లి, శేషమ్మగూడెం తదితర విలీన గ్రామాల పరిధిలో అరకొర డ్రెయినేజీలతో మురుగునీటి సమస్య ఎదురవుతోంది. మున్సిపాలిటీ పరిధిలోని అసలే యూజీడీ లేని 8 వార్డులతోపాటు అక్కడక్కడా మిగిలి పోయిన కాలనీలతో కలుపుకుంటే మరో 400 కిలోమీటర్ల అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వేయాల్సి ఉంది. ఇందుకు రూ.600 కోట్లకు పైగా ఖర్చయ్యే అవకాశం ఉన్నట్లు గతంలోనే ప్రజారోగ్య శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అయినప్పటికీ గత ప్రభుత్వ హయాంలో అరకొర పనులే కొనసాగాయి.

యూజీడీ వస్తే సీసీ రోడ్లు కూడా..

విలీన గ్రామాలతోపాటు పాత వార్డుల్లోని శివారు కాలనీల్లో సీసీ రోడ్లు లేకపోవడంతో కొద్దిపాటి వర్షం వచ్చినా పెద్ద, పెద్ద గుంతల్లో బురదనీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే పట్టణానికి పూర్తి స్థాయిలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ స్కీంను తీసుకొస్తే దాంతో పాటే సీసీ రోడ్ల సమస్య కూడా తీరే అవకాశం ఉంది. గతంలో యూజీడీ స్కీం కిందనే భూగర్భ డ్రెయినేజీ, కాలనీల్లో సీసీ రోడ్లు వేసిన విషయం తెలిసిందే. అప్పట్లో కూడా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలోనే పట్టణానికి యూజీడీ పనులు మంజూరయ్యాయి. ఇప్పుడు మళ్లీ కోమటిరెడ్డి మంత్రి కావడంతో కొత్త ప్రభుత్వంలో నీలగిరికి అత్యధిక నిధులు తెచ్చి యూజీడీ పనులు పూర్తి చేయిస్తారని ప్రజల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా రాజారావు



కొండమల్లేపల్లి: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా అధ్యక్షుడిగా దేవరకొండ పట్టణానికి చెందిన యేకుల రాజారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

'ప్రజా పాలన'కు సన్నద్ధం

ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం కసరత్తు

- 28 నుంచి గ్రామ, వార్డు సభలు
- లబ్ధిదారుల ఎంపికకు అర్జీలు స్వీకరించాలని నిర్ణయం
- నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల ఆధ్వర్యంలో అధికారులతో సమీక్ష
- హాజరు కానున్న కోమటిరెడ్డి, ఉత్తమ్, మండలి ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డి



గ్రామ సభల నిర్వహణపై జిల్లా అధికారులతో సమావేశమై చర్చిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ: కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా పాలనకు శ్రీకారం చుట్టింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు పూనుకుంది. ఇందులో భాగంగా ఆరు గ్యారంటీలకు అర్హులను ఎంపిక చేసేందుకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని భావిస్తోంది. వచ్చిన దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్ చేస్తే ఆయా పథకాలకు సంబంధించి అర్హులను లబ్ధిదారులను ఎంపిక చేసి ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

నేడు మంత్రుల సమావేశం

ఇందుకు గాను జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు నల్లగొండలోని ఎంఎస్ ఆర్ గార్డెన్స్‌లో సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, కమిషనర్లు, డివిజన్ స్థాయి అధికారులు హాజరుకానున్నారు.

జనవరి 6 వరకు గ్రామ సభలు

ఈనెల 28 నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు గ్రామ, వార్డు సభలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతిరోజూ అన్ని మండలాల్లో రోజుకు 2 గ్రామ సభలు నిర్వహించాలని తలపెట్టింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సభలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ సెలవు దినాలైన ఈనెల 31, జనవరి 1 తేదీల్లో సభలు ఉండవు. ఈ సభల నిర్వహణకు తహసీల్దార్, ఎంపీడీఓల ఆధ్వర్యంలో మండలానికి రెండు బృందాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి నియోజక వర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించనున్నారు. గ్రామ సభలు, వార్డు సభల సందర్భంగా అక్కడకు వెళ్లి పక్కా ప్రణాళికతో సభ నిర్వహించాల్సి ఉంటుంది. మొదట ప్రభుత్వ సందేశాన్ని చదివిన తర్వాత కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అయితే ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తుల ఫారాలను గ్రామ సభకు ముందుగానే వార్డులు, గ్రామాల్లో ప్రజలకు పంపిణీ చేస్తారు. మహిళలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. నిరక్షరాస్యుల దరఖాస్తులను నింపడానికి అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సేవలను కూడా వినియోగించుకోవాలని నిర్ణయించారు. దరఖాస్తు చేసేందుకు ఏయే ధ్రువీకరణ పత్రాలు అవసరమో ప్రజలకు ముందుగానే తెలియజేస్తారు. ప్రజాపాలన కింద సేకరించిన దరఖాస్తులను ఆయా మండలాల వారీగా అధికారులు ఆన్‌లైన్ చేసి ప్రభుత్వానికి పంపనున్నారు. ఆ తర్వాత ప్రభుత్వం అర్హులైన వారిని పథకాలకు లబ్ధిదారులుగా ఎంపిక చేయనుంది. అయితే మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రుల ఆధ్వర్యంలో జరిగే ఉమ్మడి జిల్లా అధికారుల సమీక్ష సమావేశంలో గ్రామ సభలు ఏ విధంగా నిర్వహించాలనే దానిపై విధివిధానాలు స్పష్టం చేయనున్నారు.

జిల్లా వ్యాప్తంగా 151 బృందాల ఏర్పాటు

ప్రజాపాలన సందర్భంగా మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలకు సంబంధించి ప్రజల నుంచి గ్రామ, వార్డు సభల్లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. అయితే మంగళవారం జరిగే ఉమ్మడి జిల్లా ప్రజా పాలన సన్నాహక సమావేశ నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ తదితర అధికారులతో చర్చించారు. సమావేశానికి ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 844 గ్రామ పంచాయతీల్లో 112 టీమ్‌లు, 8 మున్సిపాలిటీల్లో 39తో కలిపి మొత్తం 151 టీమ్‌లను ఏర్పాటు చేయనున్నారు.

క్లుప్తంగా

మూర్ఛతో గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

కొండమల్లేపల్లి: మూర్ఛ వచ్చి పడిపోయిన గుర్తుతెలియని వ్యక్తిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండ్ వద్ద జరిగింది. కొండమల్లేపల్లి ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఓ కిరాణ దుకాణం ఎదుట సోమవారం గుర్తుతెలియని వ్యక్తికి మూర్ఛ(ఫిట్స్) వచ్చి కిందపడిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే పోలీసులు, 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సదరు వ్యక్తిని అంబులెన్స్‌లో దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదని, మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంచినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి గురించి తెలిసిన వారు కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని అన్నారు.

ఆటోకు నిప్పంటించిన గుర్తుతెలియని వ్యక్తులు

భువనగిరి రూరల్: గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి ముందు పార్కింగ్ చేసిన ఆటోకు నిప్పంటించారు. ఈ ఘటన భువనగిరి మండలంలోని తాజ్‌పూర్ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాజ్‌పూర్ గ్రామానికి చెందిన బొమ్మారపు రామకృష్ణ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున అతడి ఇంటి ముందు పార్కింగ్ చేసిన ఆటో స్టార్ట్ అయిన శబ్దం విని అతడి తల్లి పద్మ లేచి చూడగా అప్పటికే ఆటో మంటల్లో ఆటో కాలిపోతోంది. వెంటనే ఆమె రామకృష్ణను నిద్ర లేపగా అతడు నీళ్లు చల్లి మంటలు ఆర్పివేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే తన ఆటోకు నిప్పు పెట్టినట్లు రామకృష్ణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


చంద్రయ్య (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామానికి చెందిన జోగు చంద్రయ్య(45) శనివారం సాయంత్రం వంగపల్లి గ్రామం నుంచి యాదగిరిగుట్టకు వెళ్లే రహదారి వెంట ఉన్న తన వ్యవసాయ పొలానికి బైక్‌పై బయల్దేరాడు. అదే సమయంలో హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి తన భార్యాపిల్లలతో కలిసి యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి కారులో వెళ్తూ చంద్రయ్య బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన చంద్రయ్యను హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

ఆస్పత్రిలో మిన్నంటిన రోదనలు


రమావత్ శివనాయక్ మృతదేహం


బల్గూరి సైదులు మృతదేహం


రమావత్ పాండు మృతదేహం


రమావత్ గనియా మృతదేహం


దుమావత్ నాగరాజు మృతదేహం


రమావత్ బుజ్జి మృతదేహం

- ఆరుగురి మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి
- కుటుంబ సభ్యులకు అప్పగించడంతో వారి స్వగ్రామాల్లో అంత్యక్రియలు పూర్తి
- ఆస్పత్రిలో మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ అర్బన్: నిడమనూరు మండలంలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన ఆరుగురి మృతదేహాలను సోమవారం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. మృతులను కడసారి చూసేందుకు వచ్చిన కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రోదనలు మిన్నంటాయి. పెద్ద దిక్కును కోల్పోయామంటూ ఒకరు..పిల్లలతో బతుకుబండి లాగించేదెట్లా దేవుడా అంటూ ఆయా కుటుంబాల సభ్యులు గుండెలవిసేలా రోదించిన తీరు కంటతడి పెట్టింది. పోస్టుమార్టం పూర్తయిన తర్వాత మృతదేహాలను పెద్దవూర, నిడమనూరు మండలాల్లోని వారి స్వగ్రామాలకు తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ...

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఏరియా ఆస్పత్రి వద్ద పరామర్శించి ఓదార్చారు. రోడ్డు ప్రమాదం జరిగిన తీరును మృతుల కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

ట్యాంకర్ వేగంగా వచ్చి ఢీకొట్టింది

- క్షతగాత్రుడు పాలేఖ

మిర్యాలగూడ అర్బన్: 'మా బంధువు చనిపోయాడని తెలుసుకుని రాత్రి ఏడుగురం కలిసి టాటా ఏస్ వాహనంలో బయలు దేరాం. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో మా వాహనాన్ని ఎదురుగా వచ్చిన ట్యాంకర్ బలంగా ఢీ కొట్టింది. దీంతో మా వాహనం రోడ్డు పక్కకు ఎగిరి పడింది. నేను వాహనం నుంచి బయటకు ఎగిరి పడ్డాను. అంతా చీకటి, మంచు కురుస్తుండటంతో ఏమీ అర్థం కాలేదు. ఆ రోడ్డుగుండా వచ్చే వాహనాలను ఆపి 108కు సమాచారం అందించాం. టాటా ఏస్ వాహనంలో అందరూ ఇరుక్కుని ఉన్నారు. రెప్పపాటులో అంతా ఘోరం జరిగింది. ట్యాంకర్ రాంగ్‌రూట్‌లో వచ్చి మా వాహనాన్ని ఢీ కొట్టింది'. మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు పాలేఖ కన్నీటి పర్యంతమయ్యాడు. హాలియా వరకు మెలకువతోనే ఉన్నానని, ఆ తరువాత నిద్రపోయానని, కళ్లు తెరిచి చూసే సరికి ఆస్పత్రిలో ఉన్నానని మరో క్షతగాత్రుడు వినోద్ తెలిపాడు.




మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమావత్ ప్రభాకర్, రమావత్ వినోద్, ముడావత్ పాలేఖ

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం : జానారెడ్డి


న్యాయం చేయాలంటూ జానారెడ్డి కాళ్లపై పడి వేడుకుంటున్న మృతుల కుటుంబ సభ్యులు

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని మాజీ మంత్రి జానారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మల్లెవానికుంటతండా, పూల్యతండాల్లోని మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని అన్నారు. అలాగే రాష్ట్ర ట్రికార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్ కూడా మృతుల కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. వారి వెంట నాయకులు కర్నాటి లింగారెడ్డి, తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, జటావత్ రవి నాయక్ తదితరులు ఉన్నారు.


రమావత్ పాండు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు


మిర్యాలగూడలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుల బంధువులు


ప్రమాద వివరాలు అడిగి తెలుసుకుంటున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


కాలిబూడిదైన ఇంట్లోని వస్తువులు

అడవిదేవులపల్లి: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన అడవిదేవులపల్లి మండలం జిలకర కుంటతండా గ్రామ పంచాయతీ పరిధిలోని హేం తండాలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు.. హేంతండాకు చెందిన రమావత్ మత్రు ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో గాఢ నిద్రలో ఉండగా ఒక్కసారిగా ఇల్లు మొత్తం పొగ కమ్ముకోవడంతో ఊపిరి ఆడక బయటకు పరుగులు తీశాడు. అప్పటికే మంటలు వ్యాపించడంతో వెంటనే అప్రమత్తమైన మత్రు ఇంట్లో ఉన్న సిలిండర్‌ను బయటకు విసిరేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని బీరువా, ఫ్రిడ్జ్, రూ.70వేల నగదు, దుస్తులు, బియ్యం, నిత్యావసర సరుకులు దగ్ధమయ్యాయి. రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. ఈ విషయం తెలుసుకున్న ఆర్ఐ ఠాగూర్ రామకృష్ణ సోమవారం హేంతండాకు చేరుకుని బాధితుడి ఇంటిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు ఇస్తానని ఆర్ఐ రామకృష్ణ తెలిపారు.

బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని అడ్డగించి రూ.4లక్షలు చోరీ

గరిడేపల్లి: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కొందరు వ్యక్తులు అడ్డగించి అతడి వద్ద నుంచి రూ.4లక్షలు అపహరించారు. ఈ ఘటన సోమవారం గరిడేపల్లి మండలంలోని ఎల్‌బీ నగర్ సమీపంలో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన బెక్కం శివ తన పొలంలో పండించిన ధాన్యాన్ని నేరేడుచర్లలోని కొనుగోలు కేంద్రంలో విక్రయించాడు. ధాన్యం విక్రయించగా వచ్చిన డబ్బులను సోమవారం శివ బైక్‌పై నేరేడుచర్ల నుంచి తీసుకొని ఇంటికి వెళ్తుండగా.. గరిడేపల్లి మండలంలోని ఎల్‌బీ నగర్ దాటిన తర్వాత కారులో వచ్చిన కొందరు వ్యక్తులు బైక్‌ను అడ్డగించి ట్యాంక్ కవర్‌లో ఉన్న రూ. 4లక్షలను అపహరించుకెళ్లారు. కాగా.. తన అన్న బెక్కం వెంకటేశ్‌తో ఫైనాన్స్ వ్యాపారంలో తలెత్తిన గొడవలను మనసులో పెట్టుకొని అతడి పార్టనర్ వెంకన్న మరికొంత మంది కలిసి తనను కొట్టి డబ్బు లాక్కొని పారిపోయారని శివ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం

- కేతేపల్లి మండలం ఇనుపాముల బస్ స్టేజీ వద్ద బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఒకరు
- భువనగిరి బైపాస్‌లోని వివేరా హోటల్ సమీపంలో కల్వర్టును ఢీకొట్టి మరొకరు..


బొడ్డు సైదులు (ఫైల్)

కేతేపల్లి: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామంలో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణానికి చెందిన బొడ్డు సైదులు(45) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సైదులు సోమవారం బైక్‌పై నకిరేకల్ నుంచి కేతేపల్లి మండలంలోని చెర్కుపల్లి గ్రామానికి వచ్చి తిరిగి నకిరేకల్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఇనుపాముల బస్ స్టేజీ సమీపంలో ఉన్న అండర్ పాస్ వద్దకు చేరుకోగానే విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సైదులుకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న కేతేపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సైదులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్ అదుపుతప్పి..

భువనగిరి క్రైం: భువనగిరి బైపాస్‌లోని వివేరా హోటల్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. ఆత్మకూరు మండలం పల్లెపహాడ్ గ్రామానికి చెందిన ఝిగ్గిరి పాండు(38) మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని మేడిపల్లిలో ప్రైవేట్ సర్వేయర్‌గా పనిచేస్తూ భార్య, తన ఇద్దరు కుమారులతో కలిసి అక్కడే నివాసముంటున్నాడు. 3 రోజులు సెలవులు రావడంతో పాండు శనివారం భార్య, తన ఇద్దరు కుమారులను సొంతూరు పల్లెపహాడ్‌లో విడిచి ఆదివారం ఉదయం తిరిగి మేడిపల్లికి వచ్చాడు. మళ్లీ ఆదివారం సాయంత్రం బైక్‌పై సొంతూరుకు వెళ్తూ భువనగిరి వరకు చేరుకుని ఇంటికి వస్తున్నానని ఫోన్ చేసి ఇంట్లో వాళ్లకి చెప్పాడు. కానీ రాత్రి 11గంటలు దాటినా పాండు ఇంటికి రాకపోవడంతో పాటు సెల్ స్విచ్ఛాఫ్ రావడంతో కుటుంబ సభ్యులు రోడ్డు వెంట వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం తెల్లవారుజామున భువనగిరి బైపాస్‌లోని వివేరా హోటల్ సమీపంలో కల్వర్టు వద్ద పాండు విగతజీవిగా పడి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కాగా పాండు బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కల్వర్టు గుంతలో పడి మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి పట్టణ ఎస్ఐ నాగరాజు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

కోదాడరూరల్ : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం సమీపంలో హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు గ్రామానికి చెందిన అలస్కాని వినయ్ (25) తన ద్విచక్రవాహనంపై విజయవాడ వైపు నుంచి తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యంలోని శ్రీరంగాపురం వద్ద గుర్తు తెలియని వాహనం అతడు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలపడంతో వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

నూతనకల్: మండల పరిధిలోని దేవాలయాలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండల కేంద్రానికి చెందిన మొగుళ్ల వెంకన్న ఉదయం వేళ దేవాలయాలను, వాటి పరిసర ప్రాంతాలను పరిశీలించి రాత్రి సమయాల్లో దేవాలయాల తాళాలను పగులగొట్టి హుండీలను ఎత్తుకెళ్లి అందులోని డబ్బులను దొంగిలించేవాడు. సోమవారం ఎర్రపహాడ్ క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా.. అనుమానాస్పదంగా కనిపించిన వెంకన్నను అదుపులోకి తీసుకొని విచారించారు. నూతనకల్ మండల కేంద్రంలోని శంభులింగేశ్వరస్వామి ఆలయంలో వెంకన్న దొంగతనం చేసినట్లు నిర్ధారణ కావడంతో అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విహారం.. విషాదాంతం

- సాగర్ వెనుకజలాల్లో మునిగి బీటెక్ విద్యార్థి మృతి
- మృతుడు నిర్మల్ జిల్లా వాసి

చందంపేట : విద్యార్థుల విహారయాత్ర చివరకు విషాదాంతంగా ముగిసింది. సాగర్ వెనుక జలాల్లో మునిగి ఓ బీటెక్ విద్యార్థి మృతిచెందాడు. నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం జెన్నారం గ్రామానికి చెందిన గండ్ర మనోహర్ కుమారుడు ఆశిశ్ (25) హైదరాబాద్‌లో బీటెక్ ఫైనలీయర్ చదువుతున్నాడు. క్రిస్మస్ సెలవులను సరదాగా గడిపేందుకు ఆశిశ్ తన నలుగురు స్నేహితులతో కలిసి సోమవారం చందంపేట మండలం వైజాగ్ కాలనీకి వచ్చాడు. అక్కడ ఈత కొట్టేందుకు సాగర్ వెనుక జలాల్లోకి దిగారు. ఈ క్రమంలో ఆశిశ్ అంబాభవాని లిఫ్ట్ పనులు జరుగుతున్న కాల్వవైపు వెళ్లి గల్లంతయ్యాడు. దీంతో వెంట వచ్చిన నలుగురు స్నేహితులు బయటికి వచ్చి విషయం చెప్పారు. దీంతో స్థానికంగా ఉన్న గజ ఈతగాళ్లు నీటిలోకి దిగి ఆశిశ్ మృతదేహాన్ని గుర్తించి వెలితీశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చందంపేట ఎస్ఐ రాజు తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు


మర్రిగూడ: బెల్ట్ షాపు నిర్వహిస్తున్న మర్రిగూడ మండల పరిధిలోని శివన్నగూడ గ్రామ పంచాయతీకి చెందిన బూతం కృష్ణయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె. రంగారెడ్డి సోమవారం తెలిపారు. శివన్నగూడ గ్రామంలో సోమవారం పోలీసులు దాడులు నిర్వహించగా కృష్ణయ్య వద్ద 27 క్వార్టర్ మద్యం సీసాలు లభించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ వెంకటేశ్వర్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్, వాహిద్‌పాషా, సైదులు, రమేష్ పాల్గొన్నారు.

లారీ బీభత్సం.. ఒకరికి గాయాలు

పెన్‌పహాడ్: మండల పరిధిలోని లింగాల క్రాస్ రోడ్డు వద్ద సోమవారం ఓ లారీ బైక్, ఆర్టీసీ బస్సు, కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న లారీ పెన్‌పహాడ్ మండలంలోని లింగాల క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న కారును, అక్కడే ప్రయాణికులను దింపేందుకు ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును, దాని వెనుక ఉన్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న హుజూర్‌నగర్‌కు చెందిన చల్లా నవీన్‌కు తీవ్ర గాయాలు కావడంతో అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అదేవిధంగా బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలైనట్లు తెలుస్తోంది.

చలి గాలులతో కోళ్లు జాగ్రత్త !

- ముందస్తు టీకాలు వేయిస్తే మంచిది
- పెద్దవూర మండల పశువైద్యాధికారి పిట్టల చంద్రబాబు


పాడి పంట

పెద్దవూర: చలికాలంలో ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో మనుషులే కాకుండా జీవులు కూడా అనారోగ్యం పాలవుతున్నాయి. తగ్గుతున్న ఉష్ణోగ్రతలతో కోళ్లకు ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా లేయర్, బ్రాయిలర్ ఫాంలు నెలకొల్పిన వారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, లేదంటే కోళ్లు అనేక వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని పెద్దవూర మండల పశువైద్యాధికారి డాక్టర్ పిట్టల చంద్రబాబు అంటున్నారు. చలికాలంలో కోళ్లఫాంల నిర్వాహకులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆయన మాటల్లోనే..

కోళ్ల పెరుగుదలలో ఉష్ణోగ్రత కీలక పాత్ర పోషిస్తుంది. దట్టంగా కమ్మే పొగ మంచు, చలిగాలులు, తేమశాతం, ముఖ్యంగా రాత్రి సమయాల్లో నిర్దిష్ట ప్రమాణాల ప్రకారం ఉంచడం ద్వారా మాత్రమే అధిక ఉత్పత్తి సాధించవచ్చు. దీని కోసం కోళ్ల ఫారాల చుట్టూ ఎత్తుగా ఉండే చెట్లు పెంచితే షెడ్లలోకి చలిగాలులు అంతగా రావు. ఉదయం వేళ సూర్యకిరణాలు పడేలా చసుకుంటే ఎదుగుదల బాగుంటుంది. షెడ్లలో ఇన్‌ఫ్రారెడ్ దీపాలు ఏర్పాటు చేయడం ద్వారా గది ఉష్ణోగ్రతను తగినంత స్థాయిలో ఉంచవచ్చు. షెడ్లలో అధిక సమయం విద్యుత్ దీపాలు తగినంతగా అమర్చి కృత్రిమ వెలుతురు ఉండేలా చూడాలి. కోళ్లు ఒకేదగ్గర గుమిగూడి ఉంటే చలికి వణికిపోతున్నట్లు గమనించి వాటికి వెచ్చగా ఉండేలా విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయాలి. ఒకే దగ్గర ఉండటంతో కోళ్లలో ఎదుగుదల లోపిస్తుంది. సాధ్యమైనంత వరకు ఇరుకు గదులు లేకుండా విశాలంగా ఉండేలా చూసుకోవాలి.


కోళ్ల ఫాంలో పెరుగుతున్న కోళ్లు


పిట్టల చంద్రబాబు, పశువైద్యాధికారి

వ్యాధులు.. నివారణ

చలికాలంలో తేమ, ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం వల్ల శిలీంద్రాలు ఎక్కువగా పెరుగుతాయి. కొన్ని శిలీంద్రాల వల్ల యాస్పర్‌గిల్లోసిస్ అనే ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధి కలిగే ప్రమాదం ఉన్నందున కోళ్లు భారీగా చనిపోతాయి. ఈ వ్యాధి వలన చిన్న పిల్లలు అధికంగా చనిపోతాయి. పెద్ద కోళ్లు గిడసబారి ఎదుగుదల తగ్గి, ఉత్పత్తి సామర్థ్యం కోల్పోతాయి.

- ❖ కొరైజా సీఆర్‌డీ(క్రానిక్ రెస్పిరేటరీ డిసీజ్): ఇది ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధి. శీతాకాలంలో వచ్చే వైరల్ వ్యాధుల్లో ముఖ్యమైనది.
- ❖ ఇన్‌ఫెక్షియస్ లారింగో ట్రాకైటీస్, ఐబీ(ఇన్‌ఫెక్షియల్ ఫైటీస్): కొరైజా హిమోఫిలస్ పారిగాలిసిరమ్ అనే సూక్ష్మక్రిమి వల్ల కలుగుతుంది. వ్యాధి బారిన పడిన కోళ్లలో 20 శాతం వరకు మృత్యువాత పడతాయి. ముఖం వాయడం, కోళ్ల నోటి నుంచి నీరు కారడం, ఉత్పత్తిలో గణనీయ తరుగుదల లక్షణాలు కనబడతాయి.
- ❖ ఐఎల్‌టీ లేదా ఇన్‌ఫెక్షియస్ లేరింగో ట్రైకైటీస్: ఈ వ్యాధి సోకితే గురక వంటి శబ్దాలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు, ఊపిరి తీసుకునేటప్పుడు మెడ సాగదీయడం వంటివి గమనించవచ్చు.
- ❖ శీతాకాలంలో వ్యాధుల నిరోధానికి పశువైద్య నిపుణులు సూచించిన మేరకు తగిన సమయంలో తగిన మోతాదుల్లో టీకాలు వేయించి జాగ్రత్త వహించాలి.
- ❖ షెడ్లలోకి వాహనాలు, అపరిశుభ్రత కాళ్లతో వెళ్లకుండా జాగ్రత్త వహించాలి. ఫార్మాలిన్ ద్రావకంతో కాళ్లు, వాహనాల టైర్లు శుభ్రపరిచిన తర్వాతనే షెడ్లలోకి అనుమతించాలి.
- ❖ ఎల్లప్పుడు తాజానీరు, దాణా మాత్రమే అందించాలి. తేమశాతం అధికంగా ఉండి నిల్వ ఉన్న దాణాలో శిలీంద్రాలు పెరిగే అవకాశం ఉన్నందున మిగిలిపోయిన దాణాను పారబోసి తాజా దాణాను ఇవ్వాలి.
- ❖ పశువైద్యుల సూచనల మేరకు తగినంత మోతాదులలో ఆక్సిటెట్రాసైక్లిన్, సల్ఫాడిమిడిన్ వంటి యాంటి బయోటిక్స్ ఇతర శానిటైజర్లు, విటమిన్ల దాణా నీటిలో కలిపి ఇవ్వాలి.

ఇవి పాటించాలి

- ❖ ఫారం కోళ్లతో దేశీయ(నాటు) కోళ్లు, వలస పక్షులు కలవకుండా చూడాలి.
- ❖ పౌల్ట్రీఫాం ప్రాంగణంలో నీరు నిలువ ఉండకుండా చూడాలి.
- ❖ కోళ్లఫాంలలో తిరిగే వ్యక్తులు గమ్‌బూట్లు, గ్లౌజులు, ముఖానికి మాస్కులు తదితర దుస్తులు ధరించాలి.

- ❖ సీఆర్‌డీ మైకోప్లాస్మా: గాలిసీరమ్ అనే క్రిమి వల్ల కలుగుతుంది. అధిక తేమ, అపరిశుభ్రత వాతావరణంతో ఈ వ్యాధి త్వరితగతిన వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి వచ్చిన షెడ్లలో గురక చప్పుడు వినిపించవచ్చు. దగ్గు, కళ్లు, ముక్కుల నుంచి ద్రవాలు కారడం, పిల్లల్లో పెరుగుదల లేకపోవడం, గుడ్లలో పొదుగుదల శాతం తగ్గడం, చిన్న పిల్లల్లో అధిక మరణాలు సంభవిస్తాయి.
- ❖ అధిక ఒత్తిడికి గురైన కోళ్లలో వ్యాధి నిరోధక శక్తి తగ్గి ఈకోలి, సాల్మనెల్లోసిస్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. కోళ్లు అధికంగా కొక్కు పట్టి గుడ్ల ఉత్పత్తి తగ్గిపోతుంది.

- ❖ కోళ్లఫాంలలో ఒకే వయసు ఉన్న పిల్లలను పెంచాలి.
- ❖ ఒక ఫాం నుంచి మరో కోళ్ల ఫాంకి వ్యక్తులు వెళ్లరాదు.
- ❖ కోళ్ల ఫాంలలోకి వెళ్లేటప్పుడు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. క్రిమిసంహారక మందులు ఉపయోగించి శుభ్రం చేసుకోవాలి. వేరొక ఫాంలోకి మూడు రోజుల వరకు వెళ్లకూడదు.
- ❖ ఫాంలలో ఉండే నీటి, దాణా, సామాగ్రి మొదలైనవి శుభ్రంగా ఉంచాలి. ప్రతి 15 రోజులకు ఒకసారి క్రిమిసంహారక మందుతో శుభ్రం చేస్తుండాలి.
- ❖ వేరే కోళ్ల ఫాంల నుంచి వస్తు సామగ్రి తీసుకోరాదు.
- ❖ కోళ్ల ఫాం ప్రాంగణం అంతా కంచె వేయాలి.
- ❖ కోడిగుడ్లకు డిస్పోజబుల్ అట్టలు వాడాలి.
- ❖ మిశ్రమ జాతులు అనగా బాతులు, కోళ్లు, పందులు మొదలైన ఫాంలు పెట్టరాదు.
- ❖ ప్రతీ బ్యాచ్‌ను పరీక్ష చేసిన తరువాతనే కోళ్ల దాణాను వాడాలి. పరిశుభ్రమైన తాగునీరు అందించాలి.
- ❖ పౌల్ట్రీ ప్రాంగణానికి ఆరు అడుగుల దూరంలో ఏ విధమైన చెత్తాచెదారం, కుళ్లిన పదార్థాలు పడేయరాదు.
- ❖ పౌల్ట్రీలో అకాల మరణం పొందిన కోళ్లను పశువైద్య నిపుణులకు చూపించి ఏ వ్యాధితో మరణించినవో తెలుసుకుని ఇతర కోళ్లకు ఆ వ్యాధి వ్యాప్తి చెందకుండా జాగ్రత్త పడాలి.